

 బడి భద్రంగానే ఉందా..?


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -102 మంగళవారం 22 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

**పార్టీ శ్రేణుల అణచి వేతకు రాష్ట్ర సర్కారు కుట్ర**

**ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం**

**మేం తప్పులు చేస్తే చర్యలు తీసుకోవచ్చు**

**సిరిసిల్లలో 8 వేల ఎకరాలు( కబ్జా చేసిందెవరు? : బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన**

**జూరాలలో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు?**

**ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం : బీఆర్ఎస్**

**నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన**



**హైదరాబాద్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో **–మిగతా 2లో...**

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

**అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు**

**అరెస్టు చేయవద్దంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన పోలీసులు**

**కౌంటర్ దాఖలు చేయాలంటూ మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు**



**హైదరాబాద్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను దూషించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ కుమార్‌రెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఈనెల ఎనిమిదిన కింది కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మధుసూదన్ రావు సోమవారం విచారించారు. పీపీ వాదిస్తూ స్పీకర్ కులం తెలిసేలా కావాలనే అనుచిత వ్యాఖ్యలు**–మిగతా 2లో...**

# తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

**లింగాల కేదారి, పుష్పలత సేవలు మరువలేనివి**

**వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



**హైదరాబాద్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మరణించిన సంగతి తెలిసిందే. **–మిగతా 2లో...**

## దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

**పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు**

**హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం**

**దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు**



**హైదరాబాద్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ **మిగతా 2లో...**

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

**రంగంలోకి రెవెన్యూ అధికారులు**

**సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి**

**మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన**

**శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన**



**సిద్దిపేట సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా**మిగతా 2లో...**

## యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ..

**మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు**



**ఢిల్లీ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, **మిగతా 2లో...**

## ఏపీలో జూడాలకు స్టైఫండ్ పెంపు

**ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల**

**పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు**

**ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం**

**2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి**



**అమరావతి సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు**మిగతా 2లో...**

## జూరాల వద్ద హైటెన్షన్

**సాగునీటి కోసం రైతుల ఆందోళన**

**ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్**

**ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్**

**గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట**



2లో.

# చెరువులకు సొబగులు

## పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన

**ఫకృద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం**

**పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ**

**గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక**

**రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి**

**పిఠాపురం సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు **మిగతా 2లో...**



## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్...

**శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**

**ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి**

**గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ**

**ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం**

**నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన**



# తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మి రెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

చేసిన ఎమ్మెల్సీలను రిమాండ్‌కు పంపేందుకు మెజిస్ట్రేట్ నిరాకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. పలువురు సాక్షుల వాంగ్మూలాలతోపాటు వీడియో ఫుటేజీలను సేకరించి కోర్టుకు సమర్పించినప్పటికీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ప్రత్యేక కోర్టు పరిధిలో ఉన్నందున మెజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించలేరని చెప్పారు. ఆ ఉత్తర్వులను రద్దు చేసి ఎమ్మెల్సీల రిమాండ్‌కు ఆదేశించాలన్నారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది

# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

**మొదటిపేజీ తరువాయి**

ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయటపెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నెపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా?అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జాఫర్ ఘడ్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక బీఆర్ఎస్ నేతలు యాస జితేందర్ రెడ్డి, తాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, యాస సందీప్ రెడ్డి, చిడిమిల్ల మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఏపీలో జూడాలకు స్టైఫండ్ పెంపు

**మొదటిపేజీ తరువాయి**

జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.

వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి**

దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

# యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ..

**మొదటిపేజీ తరువాయి**

గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం: అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా, అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుకే జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాసను విమర్శించే ట్రంప్ కూడా ఏకీభవించడం గమనార్హం.ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో తమ చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనుండగా, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

**మొదటిపేజీ తరువాయి**

పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్...

**శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్ సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# చెరువులకు సొబగులు

**మొదటిపేజీ తరువాయి**

సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా





జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పట్టణ వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు షెడ్యూల్

**41 చోట్ల రేపటి నుంచి 25 వరకు ఇంటింటి సర్వే**

**అమరావతి, సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని 41 పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు ఈనెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఎన్నికల రోల్‌ను వార్డు, పోలింగ్ స్టేషన్ వారీగా విభజించి ఓటర్లను గుర్తిస్తారు. ఎస్టీ ఓటర్లను ఆకుపచ్చ, ఎస్సీ ఓటర్లను ఎరుపు బాల్‌పాయింట్ పెన్‌తో గుర్తించడంతో పాటు మహిళా ఓటర్లను, బీసీ ఓటర్లను నల్ల బాల్ పాయింట్ పెన్‌తో గుర్తించనున్నారు. గుర్తించిన ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్లతో పాటు బీసీ ఓటర్ల ముసాయిదా ఓటర్ల జాబితాలను 26న మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. 27, 28 తేదీల్లో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. క్లెయిమ్ ఫారం-2లో, అభ్యంతరాలు ఫారం-3లో దాఖలు చేయాలి. క్లెయిమ్‌ల జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తారు.అభ్యంతరాలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేస్తారు. 29, 30 తేదీల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ నిర్వహించి ముసాయిదా జాబితాలను సవరిస్తారు. అనంతరం అక్టోబరు 1న ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల తుది వార్డు వారీ జాబితాలను ఫారం-6లో ప్రచురించి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు సమర్పిస్తారు. బీసీ ఓటర్ల జాబితాకూ అదే షెడ్యూల్ వర్తిస్తుంది. మొత్తం ప్రక్రియను 9 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల్లో అమలు కానుంది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురం ప్రాంతాల పరిధిలోని పట్టణ స్థానికసంస్థలు ఇందులో ఉన్నాయి.

# జూరాల వద్ద హైటెన్షన్

## సాగునీటి కోసం రైతుల ఆందోళన

**ఆత్మకూరు సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

## తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



**కేసముద్రం/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని మూడో వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి తక్షణ పరిష్కారం చూపారు. నీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని గుర్తించిన సర్పంచ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే చర్యలు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, వార్డు సభ్యులు జీజుల సందీప్, రాజబోయిన శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేతిగాయం.. హత్యను బయటపెట్టింది!

### తమ్ముడిని కత్తితో పొడిచిన అన్న అరెస్ట్.. 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

**గీసుగొండ/సెప్టెంబరు 21(జర్నలిస్ట్ వార్త);**గరీబ్‌నగర్‌లో తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసును 24 గంటల్లో ఛేదించాం. నిందితుడి చేతికి అయిన గాయం దర్యాప్తులో కీలక ఆధారంగా మారిందిఅని ఏసీపీ మామునూరు ఎన్. వెంకటేష్ తెలిపారు.
ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.ఈ నెల 19న రాత్రి 9.30 గంటల సమయంలో గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఎలుబాక ప్రసాద్ (31) కత్తిపోట్లకు గురై మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.
డబ్బుల విషయంలో ప్రసాద్, అతడి అన్న ఎలుబాక ప్రవీణ్ (33) మధ్య గతంలో గొడవలు జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. తల్లి నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని, ఆ సమయంలో ప్రవీణ్ కత్తితో దాడి చేసినట్లు ఆధారాలు




లభించాయని చెప్పారు. దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో ప్రవీణ్ బొటనవేలుకు గాయమైందన్నారు. గాయానికి చికిత్స కోసం 20న తెల్లవారుజామున ఆర్ఎంపీ వైద్యుడిని ప్రవీణ్ సంప్రదించాడని, గాయం ఎలా అయిందని అడగగా తమ్ముడిని కత్తితో పొడిచిన సమయంలోనే గాయమైనట్లు చెప్పినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సమాచారం దర్యాప్తులో కీలకంగా మారిందన్నారు.
నిందితుడు తన ఇంటివైపు వస్తున్నాడన్న సమాచారంతో సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. అతడి సమాచారంతో ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన గీసుగొండ సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్ కుమార్, కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను ఏసీపీ అభినందించారు.

# పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి చేస్తా

### రైతులకు సహకార సంఘాల ద్వారా అండగా ఉంటాం

**హసన్‌పర్తి/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని హసన్‌పర్తి పీఏసీఎస్ నూతన చైర్మన్ పింగిళి వెంకట్రామ్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం నూతన పాలకవర్గంతో కలిసి ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు అందే సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు కృషి



చేస్తానన్నారు. రైతులకు విత్తనాలు, పంట రుణాలు, వ్యవసాయ అవసరాలు, పంట విక్రయాల వరకు సహకార సంఘాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పార్టీ నాయకుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, పీఏసీఎస్ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, హసన్‌పర్తి మండల, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, నూతన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ హిజ్రాలతో సమాజంలో మాకు నష్టం

**కల్లూరు/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న నకిలీ హిజ్రాల ఘటనలకు కల్లూరు మండల పరిధిలోని హిజ్రాలకు ఎలాంటి సంబంధం లేదని హారిక తెలిపారు. నకిలీ హిజ్రాల కారణంగా తమ సమాజానికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కల్లూరు మండలంతో పాటు ఐదు మండలాల పరిధిలో హిజ్రా వ్యవస్థను అనుసరిస్తూ ప్రజలకు ఎలాంటి హాని కలిగించకుండా, వారు అందించే సహాయాన్ని స్వీకరిస్తూ ఆశీర్వాదాలు అందిస్తున్నామని తెలిపారు. వివాహాలు, ఇతర శుభకార్యాలకు వెళ్లినప్పుడు పరస్పరం ఆశీర్వాదాలు తీసుకుంటూ ఇచ్చిపుచ్చుకునే విధంగా ఉంటున్నామని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో జరిగిన ఘటనలు తమకు ఎంతో బాధ కలిగించాయని హారిక అన్నారు. హిజ్రా సమాజానికి చెడ్డపేరు తెస్తున్న నకిలీ హిజ్రాలను గుర్తించి, వారిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఆమె డిమాండ్ చేశారు.



## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 120 దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరగా



పరిష్కరించాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులు ఫేస్ రికగ్నిషన్ బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసి సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ కోసం టి-ఫైబర్ సేవలను వినియోగించుకోవాలని, ఇందుకు సంబంధించిన పనుల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని సూచించారు.అనంతరం మా అంగన్వాడీమా బాధ్యత నినాదంతో నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ్ మాసం గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, డీఆర్వో నాగలక్ష్మి, డీఆర్డీఓ మధుసూదనరాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



**మధిర/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
కంచికచర్ల గ్రామానికి చెందిన కొమ్మినేని మాధవి, రవిచంద్ర దంపతుల కుమార్తె పూర్ణిక పుట్టినరోజు సందర్భంగా సోమవారం మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకులు, సిబ్బంది పూర్ణికకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## జిల్లా క్రీడలకు కల్వల మోడల్ స్కూల్ విద్యార్థులు



**కేసముద్రం/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండలం కల్వల తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 18, 19 తేదీల్లో పెనుగొండలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ పరిమి నవీన్, పీడీ లలిత తెలిపారు.
14 ఏళ్లలోపు కోకో విభాగంలో సిద్దుతో పాటు, 17 ఏళ్లలోపు విభాగంలో మరో ఏడుగురు విద్యార్థులు కోకో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం మెడల్స్, షీల్డులతో అభినందించింది. ఉపాధ్యాయులు సురేందర్, యాకయ్య, వీరబాబు, శ్రీదేవి, హెల్త్‌కేర్ ఇన్‌చార్జి ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్ రమ్య, బిందు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు

## వర్ధంతి సందర్భంగా అన్నదానం



**మధిర/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** కీర్తిశేషులు చెంద్యాల భాగ్యమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మధిర పట్టణంలోని సుశీల డిగ్రీ కళాశాల రోడ్డులో గల ఆదరణ సేవా ఫౌండేషన్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భాగ్యమ్మ కుమారుడు కోటేశ్వరరావు, కుటుంబ సభ్యుల సహకారంతో వృద్ధులు, మతిస్థిమితం లేని వారికి భోజనం వడ్డించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి మాట్లాడుతూ అన్నదానానికి సహకరించిన కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భాగ్యమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## నిజాం చెరువు నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన

**మహబూబాబాద్/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**
వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లోని నిజాం చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ సోమవారం పరిశీలించారు. పోలీసు, మున్సిపల్ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.
భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, నిమజ్జన క్రేన్ల ఏర్పాటు తదితర అంశాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.



ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మురళి నాయక్ సహకారంతో నిజాం చెరువు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి భవిష్యత్‌లో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్నేరు వాగు వద్ద బతుకమ్మ ఘాట్ అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సువర్ణపు సోమయ్య, కమిషనర్ వినోద్ కుమార్, డీఎస్పీ తిరుపతి రెడ్డి, సీఐ అంజలి, డీఈ ఉపేందర్, ఏఈ కుమార్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్మణ్ నాయక్‌పై హత్యాయత్నం

### పాత కక్షలు, రాజకీయ విభేదాలే కారణం.. నలుగురు అరెస్ట్



**ధర్మసాగర్/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిపేట గ్రామ శివారులో వేలేరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూరావత్ లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్ఓ అనుముల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.రాజకీయంగా ఎదుగుతున్న లక్ష్మణ్ నాయక్‌పై పార్టీ పదవులు, ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో ఎండీ సద్దాం హుస్సేన్ కక్ష పెంచుకున్నట్లు తెలిపారు. అతడితో పాటు బైరి అనిల్, అందె కృపాసాగర్, కురసపల్లి హరీష్ కలిసి హత్యకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు.సెప్టెంబర్ 17న హనుమకొండ నుంచి వేలేరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న లక్ష్మణ్ నాయక్‌ను సాయిపేట శివారులో వెంబడించి వెనుక నుంచి ఇనుప రాడ్డుతో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 249/2026, బీఎన్ఎస్ సెక్షన్ 109 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.దర్యాప్తులో భాగంగా ఎండీ సద్దాం హుస్సేన్ (36), బైరి అనిల్ (36), అందె కృపాసాగర్ (27), కురసపల్లి హరీష్ (22)లను సోమవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్ఓ హెచ్చరించారు. ఈ సమావేశంలో వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్. ధర్మసాగర్ ఎస్సై , దిలీప్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

### విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్



**కేసముద్రం/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. సోమవారం పద్మశాలి భవన్‌లో ఆయన వర్ధంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కేసముద్రం ప్రధాన కూడలి (పాత పొట్టి శ్రీరాములు సెంటర్)లో బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, కూడలికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ యోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కొలిపాక వెంకన్న, శీలం సత్యనారాయణ, కంచ వెంకన్న, సామల నరసయ్య, మామిడాల శ్రీనివాస్, సామల రమేష్, బొద్దుల సతీష్, పాము రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామస్వామి ఆలయంలో మహా అన్నదానం



**తల్లాడ/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** నారాయణపురం శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిది రోజులుగా నిర్వహించిన ప్రత్యేక పూజలు సోమవారం మహా అన్నదానంతో ముగిశాయి. కోదండ రామస్వామి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు (జీవీఆర్), షేక్ ఈసూబ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, యువజన సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భూస్వాముల రేషన్ కార్డులు రద్దు చేయాలి



**తల్లాడ/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** భూస్వాముల రేషన్ కార్డులను రద్దు చేసి, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రతినిధులు కోరారు. సోమవారం తల్లాడ మండల ప్రజావాణిలో ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేశారు. భూస్వాములకు రేషన్ కార్డులు ఉండటంతో ప్రభుత్వ రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, దళారులు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని వారు పేర్కొన్నారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా అనర్హుల రేషన్ కార్డులను తక్షణమే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ఖమ్మం జిల్లా గాస్పెల్ సింగర్ సెక్రటరీ ఖమ్మంపాటి ఇజ్రాయిల్, టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షుడు నారపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు ఎంపీడీవో శ్రీధర్‌రాజు, ఎంఈవో దామోదర్ ప్రసాద్, ఆర్ఐ వసీంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# ఘనంగా వినాయక చవితి నవరాత్రి వేడుకలు



**తల్లాడ/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామంలో వినాయక చవితి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పలు వినాయక మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్ పలు వినాయక మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి నవరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ నాయకుడు సామినేని రామ్‌అప్పారావు, జక్కంపూడి రమేష్, జక్కంపూడి అభిమానులు, గణేశ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రెండు తరాల ఉద్యమకారుల సమ్మేళనం విజయవంతం చేయాలి



**ఖమ్మం/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబరు 11న నిర్వహించనున్న రెండు తరాల ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉద్యమ నేత డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రహీం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉద్యమకారులను కేకే కమిటీ ద్వారా గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని, 250 గజాల ఇంటి స్థలం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పెన్షన్, గుర్తింపు కార్డులు, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. జిల్లాలు, విశ్వవిద్యాలయాల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందె కృష్ణ, కందుల శ్రీను, డాక్టర్ ప్రభాకర్, రాచమల్ల జానయ్య, గడ్డం శ్రీరాములు, సూర్యారావు, జోగు గణేష్, బోరెల్లి సురేష్, కృష్ణమోహన్, గాంధీ, శ్రీకాంత్, గద్వాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ద

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

## డా. మధుపాక ఎల్లయ్య





**వరంగల్/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త):** అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువత సామాజిక చైతన్యానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మధుపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. వరంగల్-కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్‌లో సోమవారం సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవ గోల్డెన్ జూబ్లీ జెండాను ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1976లో ఏర్పాటైన అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని ఎల్లయ్య తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేసిన సభ్యులను స్మరించుకున్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, సత్యనారాయణ, సింగారపు చిరంజీవి, పెండ్యాల స్వరాజ్, దాసారపు సారయ్య, జన్ను వేణు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో ఘనంగా పసుమర్తి పద్మ విహాన్ పుట్టినరోజు వేడుకలు

**తల్లాడ/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్రావు, దోసపాటి శ్రీనివాసరావుల మనవడు పసుమర్తి పద్మ విహాన్ (అమెరికా) పుట్టినరోజు వేడుకలను సోమవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. విహాన్ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా జీవిస్తూ విద్యాభ్యాసంలో ఉన్నతంగా రాణించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటగిరి గ్రామానికి చెందిన నారపోగు ప్రసాద్, తల్లాడకు చెందిన బాబురావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, నరేంద్ర, రమేష్, షేక్ సోందు, నాగులు, మేర, బడే తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదేలే.. బరాబర్ బరిలో ఉంటా!

**మేయర్ రేసులో నేనే.. లేదంటే నా కూతురు**

**అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తా**

**డీలిమిటేషన్ తర్వాతే సీటుపై స్పష్టత**

**ఐదు నియోజకవర్గాల్లో నాకంటూ బలం ఉంది**

**పార్టీ మారను.. మడమ తిప్పను**

**రాజకీయాల్లో పెరిగిన పవర్.. మనీ ప్రభావం**

**జంగా రాఘవరెడ్డి**




**హసన్‌పర్తి/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** రాబోయే ఎన్నికల్లో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తానని తెలంగాణ స్టేట్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి స్పష్టం చేశారు. తాను రాజకీయ బరిలో నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తగ్గేదేలే. బరాబర్ బరిలో ఉంటా అంటూ తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. మేయర్ పదవి రేసులో తాను ఉంటానని, ఒకవేళ తాను పోటీ చేయని పరిస్థితి వస్తే తన కూతురిని బరిలో దింపుతామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గాల డీలిమిటేషన్ పూర్తయిన తర్వాతే ఏ సీటు నుంచి పోటీ చేయాలనే అంశంపై స్పష్టత వస్తుందని చెప్పారు.
ఐదు నియోజకవర్గాల్లో తనకు బలమైన రాజకీయ పునాది ఉందని జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. ప్రజలతో తనకు ఉన్న అనుబంధమే తన బలమని అన్నారు. పార్టీ మారే ప్రసక్తే లేదని. మడమ తిప్పే ప్రసక్తి అంతకంటే లేదని స్పష్టం చేశారు.
ప్రస్తుత రాజకీయాల్లో ప్రజా సమస్యల కంటే అధికారం, డబ్బు ప్రభావం పెరుగుతోందని వ్యాఖ్యానించారు. రాజకీయాలు ప్రజల కోసం ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల కోసం ఆలోచన. ప్రజల కోసం అడుగు. ప్రజల కోసం పోరాటం. ప్రజలతోనే ప్రయాణం అనే నినాదంతో ముందుకు సాగుతానని జంగా రాఘవరెడ్డి స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణంలో ప్రజలే కేంద్రబిందువుగా ఉంటారని పేర్కొన్నారు.

# జిల్లా క్రీడలకు వివేకవర్ధిని విద్యార్థులు



**కేసముద్రం/సెప్టెంబరు 21 (జర్నలిస్ట్ వార్త):** జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెనుగొండలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. కబడ్డీ అండర్17లో భూక్య విజయ్, అండర్14లో భూక్య మోహన్, అజ్మీరా జ్ఞానేశ్వర్ ఎంపికయ్యారు. ఖోఖో అండర్17లో వాంకుడోత్ భరత్, కుండే ప్రణయ్, వాంకుడోత్ నగేశ్, అండర్14లో బానోత్ అనిరుద్, గుగులోతు నవదీప్ ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్14లో చిలుకూరి శ్రీచందు, సపావట్ మోహన్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థుల ఎంపికపై పాఠశాల ఆవరణలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేశ్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టు పేరిట బంగారు వ్యాపారులకు టోకరా

**పోలీసులమంటూ బెదిరింపులు..**

**రూ.4.20 లక్షలు వసూలు**

**ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు..**

**పోలీసు యూనిఫాం, సెల్‌ఫోన్ స్వాధీనం**




**మహబూబాబాద్/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త):** పోలీసులమంటూ బంగారు వ్యాపారులను బెదిరించి డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్టు చేశారు. నల్గొండ జిల్లా నిడమనూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్ (29), చింతలచెరువుకు చెందిన ప్రశాంత్ (26)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నేరానికి ఉపయోగించిన సెల్‌ఫోన్, పోలీసు యూనిఫాంను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ వెల్లడించారు.

**ఎస్ఐనంటూ ఫోన్**

నిందితుడు ఇర్ఫాన్ పోలీసు యూనిఫాంలో దిగిన ఫొటోను వాట్సాప్, ట్రూకాలర్ ఖాతాల్లో డీపీగా పెట్టుకునేవాడు. గూగుల్ ద్వారా బంగారు వ్యాపారుల ఫోన్ నంబర్లను సేకరించి వారికి ఫోన్లు చేసేవాడు. ఈ నెల 10న కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాలచారికి ఫోన్ చేసి తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం ఎస్ఐనని పరిచయం చేసుకున్నాడు. తమ వద్ద ఉన్న దొంగలు వ్యాపారి వద్ద బంగారం విక్రయించారని, ఆ బంగారాన్ని రికవరీగా ఇవ్వకపోతే అరెస్టు చేస్తామని బెదిరించాడు.

**క్యూఆర్ కోడ్‌తో రూ.88 వేలు వసూలు**

అరెస్టు భయంతో ఉన్న వ్యాపారికి వాట్సాప్‌లో క్యూఆర్ కోడ్ పంపి రూ.88,026 ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 225/2026 కింద కేసు నమోదైంది.

**సాంకేతిక ఆధారాలతో పట్టివేత**

కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, ఎస్ఐ కె.క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సైబర్ నేరాల పోర్టల్ సమాచారం, బ్యాంకు లావాదేవీలను పరిశీలించి నిందితుల ఆచూకీ గుర్తించారు. ఆదివారం సాయంత్రం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

**రెండు రాష్ట్రాల్లో రూ.4.20 లక్షలు**

విచారణలో ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలువురు బంగారు వ్యాపారులను ఇదే తరహాలో బెదిరించి రూ. 4.20 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. 2024-25లోనూ నిందితులు తమ గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి నల్గొండ, ఆదిలాబాద్, ఎచ్చోడ, కట్టంగూర్, తిరుమలగిరి, రామగూడెం, బిక్కవోలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

పోలీసుల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్టు పేరుతో చేసే బెదిరింపులకు ప్రజలు, వ్యాపారులు స్పందించవద్దని ఎస్పీ సూచించారు. చట్టబద్ధంగా పనిచేసే పోలీసులు ఫోన్‌లో డబ్బులు డిమాండ్ చేయరని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఇచ్చిన మాట ప్రకారం ఘనపూర్ ను మున్సిపాలిటీ చేశా

**... స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**...ఏ ఎన్నికలు వచ్చినా స్టేషన్ ఘనపూర్ పై కాంగ్రెస్ జెండానే ఎగరాలి**

**... రాజకీయాల్లో సిగ్గులేని వ్యక్తి మాజీ ఎమ్మెల్యే రాజయ్య**





**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త) :** ఎన్నికల అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం స్టేషన్ ఘనపూర్ ను మున్సిపాలిటీ చేశానని, మున్సిపా లిటీ అభివృద్ధికి 50కోట్ల నిధులు మంజూరు చేయించానని, రాజకీయాలలో సిగ్గులేని వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది మాజీ ఎమ్మెల్యే రాజయ్యనేనని, రాజయ్య డకౌట్ కాలేదని హిట్ వికెట్ ద్వారా సెల్ఫ్ గోల్ కొట్టుకున్నాడని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ పట్టణ, వార్డు, అనుబంధ కమిటీల పరిచయకార్యక్రమం, పట్టణ విస్తృత స్థాయి సమా వేశానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కొత్తగా ఎన్నికై న పట్టణ కమిటీ కార్యవర్గ సభ్యులు, వార్డు అధ్య క్షులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాజకీయాలలో నాలుగుసార్లు ఎమ్మెల్యే గా గెలిచిన వ్యక్తిని ఉప ముఖ్యమంత్రి పదవి నుండి భర్తరఫ్ చేసి కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదు అంటే ఇంతకంటే సిగ్గుచేటు ఇంకా ఏమైనా ఉంటుందా అని ఏద్దేవా చేశారు. వాళ్ళు వాళ్ళ స్థాయిని మించి సభ్యత సంస్కారం లేకుండా హీనంగా మాట్లాడుతున్నారని అలాంటి వాళ్ళను ప్రజలు కూడా హీనంగానే చూస్తారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజ కవర్గం పేరును, ఎమ్మెల్యే పేరు చెప్పుకోవడానికే సిగ్గు పడేటట్లు చేసిన వారి పేరు నేనూ మర్చిపో యానని, ప్రజలుకూడా మర్చిపోయారనిఅన్నారు. మంజూరు చేశారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి 50కోట్లు మంజూరు చేయించానని, ఇప్పటికే కొన్ని పనులు కొనసాగుతున్నాయని, అతి త్వరలోనే 50కోట్ల పూర్తి పనులు ప్రారంభం అవుతాయాని వెల్లడించారు. వీటితో పాటు ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి మరో 8కోట్లు మంజూ రు అయ్యాయని తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రతీ వార్డుకు 15లక్షల అభివృద్ధి నిధులు, 10 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అలాగే స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి కుడి కాలువ ద్వారా కాలువ మరమ్మత్తు లు చేసి మున్సిపాలిటీ రైతులకు సాగు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీ లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నా యని బిఆర్ఎస్, బీజేపీల దాడిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి లు తెలంగాణకు ఎం తెచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలకు వేల కోట్ల నిధులు మంజూరు చేస్తూ తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని ఆరోపిం చారు. మన హక్కులను కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని తెలిపారు. కేసీఆర్ కుటుం బం10ఏళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని వందల ఎకరాల భూమిని ఆక్రమించుకురాని ఆరోపించా రు. కేసీఆర్ కుటుంబానికి 2014ఎన్నికల అఫిడవిట్ లో ఒక్క ఎకరం లేదని చెప్పిన మీకు వందల ఎకరాలు, ఫామ్ హౌస్ లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అవి ఎప్పుడు, ఎలా వచ్చాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వయంగా కేసీఆర్ బిడ్డే తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చా రు. రాబోయే రోజులలో ఏ ఎన్నికలు వచ్చినా స్టేషన్ ఘనపూర్ లో కాంగ్రెస్ జెండానే ఎగరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పట్టణ కాంగ్రె స్ పార్టీ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు అధ్యక్షులు, పట్టణ కమిటీ కార్య వర్గ సభ్యులు, జిల్లా, మండల స్థాయి నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల వద్ద అధ్వాన పారిశుద్ధ్యం

## దోమలు, విషపురుగుల బెడద.. విద్యార్థుల భద్రతపై అధికారులు దృష్టి సారించాలి.

**సత్తుపల్లి/సెప్టెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ బాలబాలికల హాస్టళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంపై బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయని, దోమలు, పాములు, తేళ్లు వంటి విషపురుగుల బెడద నెలకొనే ప్రమాదం ఉందని తెలిపారు. హాస్టల్ నుంచి విద్యార్థులు రాకపోకలు సాగించే మార్గంలో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రివేళ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. హాస్టల్‌కు సమీపంలోని ఖాళీ ప్రదేశాలు చెత్తకుప్పలుగా మారి, పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్నాయని తెలిపారు.



విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకుని హాస్టల్ పరిసరాల్లో చెత్తను వెంటనే తొలగించాలని, పిచ్చిమొక్కలను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు రాకపోకల మార్గాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జొన్నలగడ్డ నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, టౌన్ కార్యదర్శి సాయి వర్ధన్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వెదుళ్ల వీరబాబు, బండి ఆంజనేయులు, బట్టి శివసాయి తదితరులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# సీతారామ పనులపై మంత్రి తుమ్మల పరిశీలన

## యాతాలకుంటలో టన్నెల్ పనుల పరిశీలన. చాపరాలపల్లిలో వంతెనకు శంకుస్థాపన

**అశ్వారావుపేట/సెప్టెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):** సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. యాతాలకుంట వద్ద జరుగుతున్న టన్నెల్ పనులను పరిశీలించి అధికారులను పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ములకలపల్లి మండలం చాపరాలపల్లి వద్ద నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు శంకుస్థాపన చేశారు. వంతెన అందుబాటులోకి వస్తే స్థానికుల రాకపోకలు సులభతరం కానున్నాయి. కమలాపురం వద్ద



నిర్మించిన సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే సాగునీటి వసతులు మెరుగుపడి



రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# నెహ్రూ పార్కుపై మున్సిపల్ నిర్లక్ష్యం

### ఫుట్‌పాత్ ఆక్రమణలతో ఇబ్బందులు..

### ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వేడుకోలు



**నర్సంపేట/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణ కేంద్రంలోని నెహ్రూ పార్కు అభివృద్ధి, పునరుద్ధరణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు పరిసరాల్లో ఫుట్‌పాత్‌లను చిన్న వ్యాపారులు ఆక్రమించి దుకాణాలను విస్తరిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. అంగడి సెంటర్‌లో సాయి బార్ నుంచి ప్రీతి హోటల్ వరకు రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికైనా పార్కు అభివృద్ధితో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ప్రజలు కోరుతున్నారు.

# బయ్యారం పెద్ద చెరువు నీటిని వెంటనే విడుదల చేయాలి.

### -ప్రజావాణిలో అధికారులకు రైతుల వినతి.



**బయ్యారం/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం పెద్ద చెరువు ఆయకట్ట పరిధిలోని పంట పొలాలకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బయ్యారం ఎంపీడీవో దీపిక,తహసీల్దార్ నాగరాజుకు ఆయకట్ట రైతులు వినతిపత్రం సమర్పించారు.చెరువు నిండి అలుగు పోస్తున్నప్పటికీ,అధికారులు నీటి విడుదల కోసం తూములు ఎత్తకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.నేటి ఉదయం 8 గంటలకు గాంధీ సెంటర్‌లోని వీబిటీ ఫంక్షన్ హాల్‌లో మండల రైతాంగం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.బయ్యారం పెద్ద చెరువు నుండి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలి.నీటి విడుదల సమయ పట్టికను వెంటనే ప్రకటించాలి.నీటి కాలువలకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించే పనులను వేగవంతం చేయాలన్నారు.బయ్యారం మండలంలోని ఆయకట్ట రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని రైతాంగ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# అకీరా వైద్య చదువుకు కేటీఆర్ అండ

## ఆర్థిక కష్టాల మధ్య ఎంబీబీఎస్ సీటు.. రూ.2 లక్షల సాయం





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా వైద్య విద్యను కొనసాగించాలన్న పట్టుదలతో ముందుకు సాగుతున్న వర్ధన్నపేటకు చెందిన వైద్య విద్యార్థిని కొండేటి అకీరాకు కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ చదువు మధ్యలో ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారడంతో స్పందించిన కేటీఆర్ రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు.

వర్ధన్నపేటకు చెందిన భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా. తుర్రూరులో పదో తరగతి, ఖమ్మంలోని అంబేద్కర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ఆమె జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించింది. అనంతరం పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు పొందింది.

**ట్వీట్‌తో కదిలిన కేటీఆర్**

అకీరా కుటుంబ ఆర్థిక పరిస్థితిని జర్నలిస్టు బొల్లెపాక రాజేష్ సామాజిక మాధ్యమం ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి చదువుకు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం తెలంగాణ భవన్‌లో రూ.2 లక్షలు అందజేశారు. అకీరా వైద్య విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు అండగా ఉంటానని తెలిపారు. కేటీఆర్ అందించిన సాయంతో తన చదువును కొనసాగించేందుకు మరింత ధైర్యం వచ్చిందని అకీరా పేర్కొంది. ఆమె కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు

# కాకతీయ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

### -హాజరైన బయ్యారం సర్పంచ్ దంపతులు.





**బయ్యారం/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు బయ్యారం గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మండపంలో విఘ్నేశ్వరునికి సర్పంచ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు.అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి భక్తులకు స్వయంగా అన్నదానం గావించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తాయని,భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక దృక్పథంతో అన్నదానాలు చేపట్టడం ఎంతో పుణ్యఫలమని అన్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ ప్రముఖులు,యువకులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘానికి ఘనంగా 50 ఏళ్ల జైత్రయాత్ర!

### 1976లో మొదలైన ప్రస్థానం..నేటికీ .కొనసాగుతున్న సామాజిక చైతన్య ఉద్యమం

### 1,054 సంఘాలు.. 47 మండల శాఖలతో విస్తరించిన అంబేద్కర్ యువజన సంఘం




**హసన్‌పర్తి/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లాలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు అధ్యక్షతన అంబేద్కర్ చౌక్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ, మండల, జిల్లా, పట్టణ స్థాయిల నుంచి యువత, యువకులు తరలివచ్చి సంఘానికి స్వాగతం పలికారు. 1976లో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, 1977 సెప్టెంబర్ 21న 1033/77 రిజిస్ట్రేషన్ నంబర్‌తో సంఘం అధికారికంగా ఏర్పడినట్లు నాయకులు తెలిపారు. జేబీ రాజు, తామస్రావు, రామకృష్ణ, నారాయణ, చెన్నయ్య తదితరుల సహకారంతో సంఘం నిర్మాణం జరిగిందన్నారు.కీర్తిశేషులు ఉపాసిక బొమ్మల కట్టయ్య ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంబేద్కర్ యువజన సంఘాన్ని విస్తృతంగా పరిచయం చేసి సుమారు 1,054 సంఘాలు, 47 మండల శాఖల ఏర్పాటుకు కృషి చేశారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్, టీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కడారి దేవయ్య, సింగారపు ఐలయ్య, తప్పెట సారయ్య, కల్కుట్ల ప్రతాప్, మునిగాల వెంకటయ్య, అల్వాల సాంబయ్య, వెంకన్న, దుర్గాప్రసాద్, ప్రభాకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌లో కాంగ్రెస్ కమిటీల పరిచయ సభ

### కార్యకర్తలే పార్టీకి బలం..

### కొత్త, పాత తేడా వద్దు కడియం శ్రీహరి

### 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉంటూ కష్టపడి పనిచేసే కార్యకర్తలకే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కొత్త, పాత అనే భేదాలకు తావులేదన్నారు.ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్‌లో నిర్వహించిన మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం, విస్తృతస్థాయి సమావేశానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా నూతన మండల కాంగ్రెస్ కార్యాలయాన్ని కడియం కావ్య, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులను సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ పార్టీ నియమావళికి కట్టుబడి క్రమశిక్షణతో పనిచేసేవారిని కాంగ్రెస్ ప్రోత్సహిస్తుందన్నారు. పేరు చెప్పుకుని ఊరేగుతానంటే తన వద్ద నడవదని, ప్రజల మధ్య ఉంటూ పనిచేసే వారికి తప్పక అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఏ కార్యకర్తకైనా న్యాయమైన పని ఉంటే తనను నేరుగా కలవచ్చన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,



సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్, బీజేపీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని శ్రీహరి ఆరోపించారు. బీజేపీ తెలంగాణకు 12 ఏళ్లలో ఏమి చేసిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అక్రమ సంపాదనతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోందని ఆరోపించారు.కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కూడా శ్రీహరి ప్రశ్నలు సంధించారు. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు లేవని పేర్కొన్న వారికి ఇప్పుడు వందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆ ఆస్తులు ఎప్పుడు, ఎలా సమకూరాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని శ్రీహరి తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మండల అధ్యక్షుడు పెసరు రమేష్, సర్పంచులు, గ్రామశాఖ





అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్‌గా అబ్బిడి రాజిరెడ్డి


-2-

| Sl.No | Name | Designation |
|---|---|---|
| 1 | Sri. Abbidi Raji Reddy | Chairperson |
| 2 | Sri. Birru Madhu | Person |
| 3 | Sri. Jannapureddy Sampath Reddy | Person |
| 4 | Sri. Eddu Rama Krishna | Person |
| 5 | Sri. Dadi Raju | Person |
| 6 | Sri. Bisupaka Poolamma | Person |
| 7 | Sri. Bellapu Uppalaiah | Person |
| 8 | Smt. Nakka Swapna | Person |
| 9 | Sri. Mohammed Valli | Person |
| 10 | Sri. Bakkathatla Raju | Person |
| 11 | Sri. Dommati Rajanna | Person |
| 12 | Sri. Kondeti Mahender | Person |
| 13 | Sri Amgothu Lachi Ram | Person |

5. The Spl. Commissioner for Cooperation & Registrar of Cooperative Societies, Telangana, Hyderabad shall take further necessary action in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

K.SURENDRA MOHAN
APC & SECRETARY TO GOVERNMENT.

To
The Spl. Commissioner for Cooperation & Registrar of Coop. Societies
Telangana, Hyderabad.
Copy to:
The P.S. to Principal Secretary to C.M.
The OSD to Minister for Agriculture & Cooperation.
The PS to APC & Secretary to Govt. Agri & Coop Dept.
SF/SCs

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER



**వర్ధన్నపేట/ సెప్టెంబరు 21(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా దమ్మన్నపేటకు చెందిన అబ్బిడి రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్ పాలకవర్గంలో చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులను నియమించారు.
రైతుల సంక్షేమం, సహకార సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని రాజిరెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం, సహకార శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండేలా సహకార సంఘం సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు.
పాలకవర్గ సభ్యులు: బిర్రు మధు, జన్నపురెడ్డి సంపత్‌రెడ్డి, ఏడు రామకృష్ణ, దాడి రాజు, బిసుపాక పూలమ్మ, బెల్లపు ఉప్పలయ్య, నక్క స్వప్న, మహమ్మద్ వల్లి, బక్కతల రాజు, డొమ్మటి రాజన్న, కొండేటి మహేందర్, అమ్గోతు లాచిరామ్. నియమితులయ్యారు.

# నేటి నుండి బయ్యారం మండలంలో అగ్రి స్టాక్ రైతు రిజిస్ట్రేషన్లు

**-వ్యవసాయ అధికారి కే.రాజు.**






**బయ్యారం/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త);**తెలంగాణ ప్రభుత్వం,వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అగ్రి స్టాక్ తెలంగాణ పథకం ద్వారా రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయించే ప్రక్రియ బయ్యారం మండలంలో ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రైతు – ఒక గుర్తింపు – సమగ్ర సేవలు నినాదంతో చేపడుతున్న ఈ ప్రక్రియ కోసం సెప్టెంబర్ 22 నుండి 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ 'ఫార్మర్ ఐడీ' ద్వారా రైతులకు ప్రభుత్వ మద్దతు ధరకు పంటల విక్రయం,ఎరువుల కొనుగోలు, వేగవంతంగా పంట రుణాలు మంజూరు,ప్రభుత్వ పథకాలు,ఇన్పుట్ సబ్సిడీలు నేరుగా అందుతాయని వివరించారు.రైతులు తమ పరిధిలోని గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కానీ సమీప మీ–సేవ కేంద్రాల్లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.నమోదు కోసం ఆధార్ కార్డు,పట్టాదార్ పాస్‌బుక్,ఆధార్‌కి లింక్ అయిన మొబైల్ నెంబర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.ఇప్పటికే నమోదైన రైతులు క్యూఆర్ కోడ్, వెబ్‌సైట్ ద్వారా తమ ఆధార్ నెంబర్ నమోదు చేసి రైతు ఐడీ పొందవచ్చని, మండలంలోని రైతులందరూ సెప్టెంబర్ 30 లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే.రాజు కోరారు.

## ఎర్రగట్టు గుట్ట గణనాథుడికి డీసీసీ అధ్యక్షుడి ప్రత్యేక పూజలు

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):**



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ మొదటి డివిజన్ ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల వద్ద కిట్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక నవరాత్రులు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, లంబోదరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కిట్స్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్, దేవరకొండ అనిల్, వీసం సురేందర్‌రెడ్డి, వీసం విజేందర్‌రెడ్డి, గరిగే రాజు, డబ్బ శ్రీను, కిట్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి.

**-ఎస్సై ప్రశాంత్ బాబు.**



**బయ్యారం/సెప్టెంబర్ 21(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేంద్రంలోని హనుమంతుని గడ్డ వీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని బయ్యారం ఎస్సై ప్రశాంత్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ బాబు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పాటు సేవా భావాన్ని చాటుతూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులందరూ శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు.ఉత్సవాల నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,యువకులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బడి భద్రంగానే ఉందా..?

**చీలికలు కనిపిస్తున్న భవనం.. పరిమితమైన ఆటస్థలం -అనుమతులు, భద్రతా ధ్రువపత్రాలపై స్పష్టత ఏదీ..?**







పాఠశాల ఆవరణంలో కరెంట్ పోల్ తీగలు...




చీలికలు పోసిన బిల్డింగ్ గోడ...



పాఠశాల ఆవరణంలో ఏపుగా పెరిగిన చెట్లు

**వర్ధన్నపేట/సెప్టెంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండల కేంద్రంలోని అరబిందో పేరుతో కొనసాగుతున్న పాఠశాల నిర్వహణ, భవన భద్రత, మౌలిక వసతులు, అనుమతులపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాఠశాలపై గతంలోనూ పలు ఆరోపణలు, సందేహాలు వెలువడిన నేపథ్యంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు సమగ్రంగా తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించకపోవడంపై తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### అరబిందో పేరుతో.. శ్రీచైతన్య నిర్వహణా?

పాఠశాల అరబిందో పేరుతో కొనసాగుతున్నప్పటికీ శ్రీచైతన్య సంస్థలకు సంబంధించిన పుస్తకాలు, విద్యా విధానం ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు మంజూరైన గుర్తింపు ఏ సంస్థ పేరుతో ఉంది? నిర్వహణ సంస్థ ఎవరు? అనుమతులు ఏ పేరుతో పొందారు? అనే అంశాలపై అధికారిక రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### భవనానికి చీలికలు.. భద్రతపై ఆందోళన

పాఠశాల భవనంలోని కొన్ని గోడలకు చీలికలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులు నిత్యం ఉండే భవనం నిర్మాణపరంగా సురక్షితమేనా? భవన నిర్మాణ అనుమతి, నిర్మాణ స్థిరత్వ ధ్రువపత్రం, అగ్నిమాపక భద్రతా అనుమతి తదితరాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు తక్షణమే పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాల భవనానికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగల విషయంలోనూ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకున్నారా? అన్నది సంబంధిత శాఖలు నిర్ధారించాల్సి ఉంది.

### ఆటస్థలం నిబంధనల మేరకే ఉందా?

పాఠశాల ఆవరణలో బస్సుల పార్కింగ్, చెట్లు తదితర కారణాలతో విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఆటస్థలం పరిమితంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. ఒకే స్థలాన్ని వేర్వేరు తరగతులకు వేర్వేరు రోజుల్లో వినియోగిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో పాఠశాలకు అనుమతి మంజూరు సమయంలో నిర్దేశించిన ఆటస్థల ప్రమాణాలు అమలవుతున్నాయా? అన్నది అధికారులు పరిశీలించాలి.

### పర్మిషన్లు ఉన్నాయా..?

పాఠశాల గుర్తింపు, భవన అనుమతి, అగ్నిమాపక శాఖ అనుమతి, విద్యుత్ భద్రత, విద్యార్థుల భద్రతకు సంబంధించిన ధ్రువపత్రాలు, మౌలిక వసతుల ప్రమాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అనుమతులు ఏ సంవత్సరంలో మంజూరయ్యాయి? ప్రస్తుతం అవి చెల్లుబాటులో ఉన్నాయా? అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం లేదా నిర్వహణ జరుగుతోందా? అన్నది కూడా తేల్చాల్సి ఉంది.

### గత ఆరోపణలపైనా విచారణ ఏది..?

పాఠశాల ఆవరణలోని భూమికి సంబంధించి గతంలో వెలువడిన ఆరోపణలపై కూడా అధికారులు పూర్తి స్థాయి విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక రికార్డులు, స్థల పరిశీలన ద్వారానే తేలాల్సి ఉంది.
విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖలు బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉంది. పాఠశాలకు సంబంధించిన అన్ని అనుమతులు, భవన భద్రత, ఆటస్థలం, విద్యుత్ భద్రత, నిర్వహణ సంస్థ వివరాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి నివేదికను బహిరంగపరచాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.
అధికారుల తనిఖీతోనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో.ఇకనైనా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకుంటారా? లేక ఫిర్యాదులు, వార్తా కథనాలు వచ్చినా పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.



విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి... మోటివేషన్ క్లాసులు చెబుతున్న దృశ్యం.



బిల్డింగ్ పై గోడ పేచ్చులు ఊడిపోతున్న దృశ్యం

# ఫైళ్ల భద్రతపై నిఘా ఏదీ?

## సమాచార హక్కు బోర్డుపైనా నిర్లక్ష్యమేనా?

## బెల్ట్‌షాపులపై చర్యల తీరు ఏమిటి.. మద్యం దుకాణాల తనిఖీలు ఎక్కడ?

**వర్ధన్నపేట/సెప్టెంబర్ 21 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయ పనితీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్యాలయంలో ఫైళ్ల భద్రత నుంచి సమాచార హక్కు చట్టానికి సంబంధించిన సమాచారం ప్రదర్శించే బోర్డు నిర్వహణ వరకు నిర్లక్ష్యం కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణ, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో నిబంధనల అమలుపై అధికారులు సమగ్రంగా దృష్టి సారిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉండగా పలు గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నప్పటికీ వాటిపై క్రమం తప్పకుండా తనిఖీలు, కేసుల నమోదు ఎందుకు జరగడం లేదనే చర్చ స్థానికంగా సాగుతోంది. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అధికారులు ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? అన్న వివరాలు వెల్లడిస్తే పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### ఎంపిక చేసిన చోట్లే తనిఖీలేనా?

బెల్ట్‌షాపులపై తనిఖీలు నిర్వహించే విషయంలో అధికారులు సమానంగా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. అధికారుల తనిఖీలకు సంబంధించిన వివరాలు, నమోదు చేసిన కేసులు, స్వాధీనం చేసుకున్న మద్యం పరిమాణం వంటి వివరాలను బహిర్గతం చేస్తే ఈ అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

### బ్రాండ్‌షాపులు.. బార్లపై నిఘా ఏది?

వర్ధన్నపేటలో నాలుగు మద్యం దుకాణాలు, రెండు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నట్లు సమాచారం. వీటిలో ధరల పట్టికలు, అనుమతించిన సమయాలు, కూర్చునే సౌకర్యాలు, పరిసరాల్లో తినుబండారాల విక్రయాలు తదితర అంశాల్లో నిబంధనలు పాటిస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో అధికారులు తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.




### నకిలీ మద్యం ఆరోపణలపై స్పష్టత ఏది?

మండలంలోని కొన్ని ప్రాంతాల్లో నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు స్పందించాల్సి ఉంది. మద్యం నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారా? నకిలీ మద్యం విక్రయాలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి? అన్న వివరాలు వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తొలగే అవకాశం ఉంది. చెన్నారం ఘటనపై వివరణ ఇవ్వాలి.ఇటీవల చెన్నారం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినట్లు సమాచారం. అనంతరం కేసులు నమోదు చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో వాస్తవ పరిస్థితి ఏమిటో, తనిఖీల్లో ఏం స్వాధీనం చేసుకున్నారు? ఏ నిబంధనల కింద కేసులు నమోదు చేశారు? అనే విషయాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.




### పారదర్శకతే సమాధానం

ఎక్సైజ్ శాఖ తనిఖీలు, కేసుల నమోదు విషయంలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. బెల్ట్‌షాపులు, మద్యం దుకాణాలు, బార్లపై నిర్వహించిన తనిఖీల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే ఆరోపణలకు అవకాశం ఉండదు. కార్యాలయ ఫైళ్ల భద్రత, సమాచార హక్కు బోర్డు నిర్వహణ వంటి అంశాలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.